టీడీపీకి ఎంత బాకా ఊదినా ప్రజలు నమ్మరు

- సీఎం జగన్‌కే జై కొడుతున్న ప్రజలు
- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఎల్లో మీడియా పత్రికలు, చానళ్లు అధికార వైఎస్సార్ సీపీపై పనికట్టుకుని బురద చల్లుతూ టీడీపీకి ఎంతగా బాకా ఊదినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, ప్రజలంతా ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే జై కొడుతున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక 40వ డివిజన్ తోటపాళ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. తన దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి గడపలో విశేష ఆదరణ లభిస్తుంటే, ఎక్కడో ఒకరు అన్న మాటలను ఎల్లో మీడియాలో వైరల్ చేయడం వారి కుటిల ప్రయత్నాలకు నిదర్శమని మండిపడ్డారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకులు ఆనంద పార్థసారథి కార్యక్రమం తీరు తెన్నులను పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గణష్, కమిషనర్ అరుణ, మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్ నాయకులు అప్పు, రాజా, నారాయణ, శరవణ, కిషోర్, నారాయణ, రమణ, మనోహర్‌రెడ్డి, చిట్టి, హరి, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

సంక్షేమ సారథి సీఎం


దిగువ తడకరలో సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

– పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

తవణంపల్లె: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఆశీస్సులు అందించి మరోసారి సీఎం పీఠం ఎక్కించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కోరారు. గురువారం ఆయన ఎగువ తవణంపల్లె సచివాలయ పరిధిలోని దిగువ తడకర, ముత్యాలమిట్ట, గల్లావాళ్లవూరు, ఎస్టీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల రూపేణా ఆయా కుటుంబాలు ఎంతెంత లబ్ధి పొందాయో గణాంకాలతో సహా వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. అలాగే జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో భాగంగా ఇంటి యజమానుల అనుమతిలో స్టిక్కర్లు అతికించారు. చంద్రబాబు పాలనలో జరిగిన ప్రజలకు జరిగిన అన్యాయం.. ప్రస్తుత సీఎం పాలనలో కలిగిన మేలును వివరించారు. తన దృష్టికి ప్రజలు తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్ధగిరి క్షేత్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను ఈఓ తొలగించడంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని, తమకు న్యాయం చేయాలని బాధితులు ఎమ్మెల్యేను ప్రాధేయపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడి, తహసీల్దార్ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ హరికృష్ణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ సిద్ధంపల్లె హరిరెడ్డి, కిషోర్ రెడ్డి, మధుకుమార్, చిట్టిబాబు, మురుగన్, ప్రభు, డిష్ మురగయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు దిగువ మోదలపల్లె పంచాయతీలో..

మండలంలోని టి.పుత్తూరు సచివాలయం పరిధిలోని దిగువ మోదలపల్లె పంచాయతీలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ వ్యవస్థ పనితీరు, ఉద్యోగాలకు కేటాయించిన విధుల గురించి సబ్ రిజిస్ట్రార్లు రహంతుల్లా, వినోద్ ఆమెకు వివరించారు. ఈసీ, సీసీ, మార్కెట్ విలువ, చెక్ స్లిప్, ఈకేవైసీ, ఫొటోలు తీయడం, స్టాంప్ పేపర్స్ తదితర అంశాల గురించి ఆమె తెలియజేశారు. పాత డ్యాకుమెంట్లను డిజిటలైజేషన్ చేయడం, సచివాలయాల్లో త్వరలో ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్ సేవలు, ఆన్‌లైన్‌లో మ్యారేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించారు.


వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి

నేడు పీసీఆర్‌లో ఉచిత వైద్యశిబిరం

చిత్తూరు కలెక్టరేట్ : అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని శుక్రవారం పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు తెలిపారు. ఉ దయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం నిర్వహిస్తామని, నగర ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చిరు వ్యాపారులకు విజయానందరెడ్డి కొండంత అండ

- మార్కెట్ వేలాన్ని మళ్లీ ఆయనే భరించారు
- గేటు వసూళ్లకు రూ.90 లక్షల వరకూ సొంత నిధులు
- హర్షం వ్యక్తం చేసిన వ్యాపారులు

చిత్తూరు రూరల్: చిరు వ్యాపారులకు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి కొండంత అండగా నిలబడుతున్నారని మార్కెట్ వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు.మూడేళ్ల క్రితం వరకు నగరంలోని వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, చిరు వ్యాపారులు, రైతులకు గేటు వసూళ్ల చెల్లింపు తలకుమించిన భారమైందని, ఈ వసూళ్ల గుత్తేదార్ల దౌర్జన్యాలు రైతులకు, వ్యాపారులకు గుదిబండగా ఉండేదన్నారు. దీనికి తోడు కరోనా వ్యాపారులను పూర్తిగా కుంగదీసిందన్నారు. అప్పట్లో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఇది గమనించిన విజయానందరెడ్డి మార్కెట్ వేలం పాటను కైవసం చేసుకుని ప్రజలకు అంకితం చేశారన్నారు. ఇది ఆనవాయితీగా మారి నేడు మూడవసారి కూడా జరగడం సంతోషకరమన్నారు. 2023–24కు మార్కెట్‌కు అన్నీ కలిపి రూ. 90 లక్షలవరకు గేటు వసూళ్ల సొంత నిధులు కట్టడం హర్షదాయకమన్నారు. అలాగే ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను ఉదహరించి కొనియాడారు. కార్యక్రమంలో వ్యాపారులు రమేష్, ముకేష్, బాషా, నాగవల్లి, మల్లిక, అక్బర్, గౌషద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మార్కెట్ వ్యాపారులు

వినాయకునికి వెండి వస్తువుల సమర్పణ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామికి గురువారం వైఎస్సార్ కడపజిల్లా జమ్మలమడుగుకు చెందిన రాజగోపాల్ రెడ్డి వెండి వస్తువులను సమర్పించారు. ఇక్కడ పవిత్రోత్సవాలలో ఉపయోగించడానికి 2కిలోల 600 గ్రాములు (సుమారు రూ.2లక్షల విలువ) కలిగిన వెండి సామగ్రిని ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


వెండి వస్తువులను ఆలయ అధికారులకు అందజేస్తున్న జమ్మలమడుగు వాసులు

అంబేడ్కర్ జయంతి ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషన్ అరుణ

చిత్తూరు అర్బన్: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని స్థానిక దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి వరకు ఏర్పాట్లు చురుగ్గా చేశారు. ఈ పనులను కమిషనర్ జె.అరుణ పరిశీలించారు. ఆమె వెంట నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది

సచివాలయం తనిఖీ

పూతలపట్టు: మండలంలోని అయ్యప్పగారిపల్లె సచివాలయాన్ని ఎంపీడీఓ గౌరి గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పోటుకనుమ గ్రామంలో పద్మ అనే మహిళ స్థలానికి మించి ఇళ్లు కట్టుకోవడంతో వాటిని తొలగించాలని తహసీల్దార్, ఎంపీడీఓ ఆదేశించారు. అనంతరం అనంతాపురంలోని వనసంరక్షణ సమితి ఏర్పాటు చేసిన ఆటస్థలంలో మొక్కలు పెంచడానికి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసిలామణి, ఏపీఓ సౌభాగ్యవతి, జేఈ పరమశివ, టెక్నికల్ అసిస్టెంట్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

యాదమరి: మండలంలోని పెరియంబాడి దళితవాడలో గురువారం వడదెబ్బపై యాదమరి వైద్యులు అనిల్‌కుమార్ నాయక్ అవగాహన కల్పించారు. ఉపాధి కూలీలు పనుల ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కూలి పనులకు వెళ్లే వారు ఎండకు నీరసంగా ఉంటే వెంటనే ఆసుపత్రి సిబ్బంది వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పొందవచ్చన్నారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూళ్ల తనిఖీ

పూతలపట్టు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని పూతలపట్టు, పోలవరం హైస్కూళ్లను తహసీల్దార్, బండపల్లె, పి.కొత్తకోట స్కూళ్లను ఎంపీడీఓ గౌరి పరిశీలించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు మంచి నీటిని ఎక్కువగా తీసుకోవాలని అధికారులు సూచించారు. పరీక్ష సమయంలో విద్యార్థులకు ఆరోగ్య సమస్యలేమైనా ఎదుర్కొన్నారా? అని ఆశావర్కర్లను అడిగి తెలుసుకున్నారు.

‘మహిళ సమ్మాన్ సేవింగ్స్’తో మేలు

చిత్తూరు కార్పొరేషన్: మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం మహిళలకు ఎంతో ఉపయోగకరమని తపాలాశాఖ సహాయ సీనియర్ సూపరింటెండెంట్ గణపతి పేర్కొన్నారు. గురువారం స్థానిక నగరపాలక కార్యాలయంలో మేయర్ అముదను కలిసి మాట్లాడారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ పథకం కింద మహిళలు రూ.1000 నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేస్తే రెండేళ్ల అయ్యాక 8 శాతం వడ్డీతో మొత్తం వస్తుందన్నారు. రూ.2 లక్షలు డిపాజిట్ చేస్తే మెచ్యూరిటీ మొత్తం రూ.2,32,044 వస్తోందన్నారు. ప్రతి మూడునెలలకోసారి వడ్డీ అకౌంటులో పడుతుందని వివరించారు. మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగినులు ఎక్కువగా ఉన్నారని, ఆసక్తి ఉన్న వారు ఈ పథకం కింద డిపాజిట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీకి వీడ్కోలు సత్కారం

చిత్తూరు అర్బన్: ఇటీవల జరిగిన బదిలీలో చిత్తూరు అడిషనల్ ఎస్పీ జగదీష్‌కు శాఖ ఉద్యోగోన్నతి కల్పిస్తూ అనంతపురం జిల్లాకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక పోలీసుల అతిథి గృహంలో జిల్లా అధికారులు ఆయనకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ రిశాంత్ రెడ్డి అడిషనల్ ఎస్పీని తన బృందంతో ఘనంగా సత్కరించారు. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మీ, డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.


బదిలీపై వెళుతున్న అడిషనల్ ఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

యాజమాన్య పద్ధతులు పాటించండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీహెచ్‌ఏ కావేరి

ఐరాల: మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని వీహెచ్‌ఏ కావేరి కోరారు. గురువారం వినాయకపురంలో రైతు విజయ్‌కుమార్‌రెడ్డి మామిడి తోటలో ఉద్యాన శాఖ ద్వారా డాక్టర్ వైఎస్సార్ తోటబడి కార్యక్రమం నిర్వహించారు. మామిడిలో సూక్ష్మ పోషకాల వినియోగం, పండు ఈగ నివారణకు చేపట్టవలసిన చర్యలు, ఎర బుట్టల ఆవశ్యకత గురించి రైతులకు ఆమె వివరించారు.

ప్రధాన వైద్యాధికారిగా శిరీష


డాక్టర్ శిరీష

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ శిరీష ప్రధాన వైద్యాధికారిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి మెడికల్ అధికారిగా ఉన్న డాక్టర్ విజయకుమారి స్థానంలో ఆమె నియమితులయ్యారు. ఆమె మాట్లాడుతూ, సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సిబ్బంది సహకారంతో మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఆసుపత్రిలో గర్భవతులకు స్కానింగ్, కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

భూసార పరిరక్షణ అవసరం

బంగారుపాళెం: నాణ్యమైన పంట దిగుబడులకు భూసార పరిరక్షణ పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏఓ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె రైతు భరోసా కేంద్రంలో గురువారం ఆర్బీకే సిబ్బందికి మట్టి పరీక్ష ప్రాముఖ్యత, నమూనాలు తీసే పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మట్టి పరీక్షలు ఏ విధంగా చేయాలి? నేల రకాలు, మట్టి పరీక్షల ప్రాముఖ్యత, భూసార పరిరక్షణ పద్ధతులు, సమస్యాత్మక భూములలో మట్టి నమూనాలు సేకరించే విధానం, భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకంపై ఆమె అవగాహన కల్పించారు. వర్షాధారిత పంట పొలాల్లో ప్రతి మూడేళ్లకోసారి, నీటి ఆధారిత పొలాలలో ప్రతి మూడు సీజన్లకోసారి మట్టి పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి పద్మజ, విస్తరణాధికారి సాదరయ్య పాల్గొన్నారు.


తిమ్మోజుపల్లెలో మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

శిక్షణతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు

పూతలపట్టు: ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలకు శిక్షణ ఇచ్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తే వారి శారీరక, మానసిక ఆరోగ్యం స్థాయి మెరుగు పడుతుందని రీడ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం స్థానిక భవిత సెంటర్‌లో ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లల హక్కులు, ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ గౌరి, ఎంఈఓ కృష్ణయ్య మాట్లాడారు. ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలకు ప్రభుత్వం పలు సదుపాయాలు, చికిత్సలు, సేవలు అందిస్తోందన్నారు. అనంతరం చిత్రాలు వేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వారికి అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. భవిత కేంద్రం సిబ్బంది లావణ్య, సుప్రజ, ఎంఆర్‌సీ సిబ్బంది భారతి, రీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న ఆనంద్, అధికారులు

మాకు భూ రికార్డులు ఉన్నాయ్

చిత్తూరు రూరల్: బంగారుపాళ్యం మండలం కల్లూరు ప్రాంతంలోని 5 ఎకరాల భూమికి సర్వ హక్కులు తమకు ఉన్నాయని, దీనికి సంబంధించిన రికార్డులన్నీ పక్కాగా ఉన్నాయని బంగారుపాళ్యం మండలం ఎద్దులవారిపల్లెకు చెందిన హిమబిందు తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తన భర్త ఆర్మీలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారని, రీసర్వీసెస్ కింద మళ్లీ విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకు ప్రభుత్వం 1999లో తన భర్త పేరిట బంగారుపాళ్యం మండలం దిగువ ఎద్దుల వారిపల్లె వద్ద 5 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. అప్పటి నుంచి కూడా వివిధ రకాల పంటలు వేస్తున్నామన్నారు. కరోనా కారణంగా ఆ భూమి దూరంగా ఉన్నామని గుర్తించి మొగిలి గ్రామానికి చెందిన గోపి ప్రసాద్, తులసి తదితరులు ఆక్రమించుకునే ప్రయత్నం చేశారని, దీనిపై పోలీసులు, రెవెవన్యూ అధికారులు ఆశ్రయించగా రికార్డులు పరిశీలించి భూమి తమదేనని స్పష్టంగా చెప్పారన్నారు. అయితే కొందరు దీనిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని పానాటూరు, గొల్లమడుగు, బొమ్మసముద్రం, మరకాలకుప్పం పంచాయతీలలో జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద తల్లిదండ్రుల పిల్లల చదువులకు ఇబ్బందులు పడకూడదనే అమ్మ ఒడి, జగనన్న వసతిదీవెన, విద్యాదీవెన, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద పథకాలను అందిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి,మండల సచివాలయ కన్వీనర్ సాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు రజనీకాంత్, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్ నాయుడు, వెంకటేష్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రజిని, శింభు, ప్రసాద్‌రెడ్డి, కలైఅరసి, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.


గుడిపాల : జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


పూతలపట్టు : గ్రామస్తులకు కరపత్రం అందజేస్తున్న నాయకులు

చిటిపిరాళ్ల పంచాయతీలో..

పూతలపట్టు: మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీ సంజీవరాయనిపల్లె, పసుపులేటివారిపల్లెలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి పూతలపట్టు మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జయపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, ఎంఎస్‌మణి, ధనం జయరెడ్డి, కమలాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, మణిరెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆగని గజరాజుల విధ్వంసకాండ


ఏనుగులు తొక్కేసిన వరి పంట

ఐరాల: మండలంలోని నాగవాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంత సరిహద్దు గ్రామమైన మొరవవడ్డిపల్లెలో పంటలపై ఏనుగుల గుంపు బుధవారం రాత్రి దాడులు చేశాయి. క్రిష్ణయ్య, వీరభద్రయ్యకు చెందిన రెండు ఎకరాల వరి పంటను తిని తొక్కి నాశనం చేశాయి. ఈ దాడుల్లో సుమారు రూ. 80 వేల పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు కృషి చేస్తామని మండల అటవీ శాఖాధికారి జయశంకర్ చెప్పారు.

క్లుప్తంగా

కుప్పిగానిపల్లెలో ‘ఫ్యామిలీ డాక్టర్’ సేవలు


రోగులను పరీక్షిస్తున్న రష్మిత

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత కోరారు. మండలంలోని కుప్పిగానిపల్లె హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం ఆమె తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటివద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సరిత, ఎంఎల్‌హెచ్‌ఓ శిల్ప, ఎంపీహెచ్‌ఎ భాస్కర్, ఆశావర్కర్ శివగామి పాల్గొన్నారు.

నేటి నుంచి వామపక్షాల ప్రచార భేరి


పోస్టర్లను విడుదల చేసిన వామపక్ష నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం నుంచి ఈనెల 30 వరకు సీపీఐ, సీపీఎం నిర్వహించనున్న ప్రచార భేరికి సంబంధించి పోస్టర్లను గురువారం విడుదల చేశారు. వామపక్షాల జిల్లా కార్యదర్శులు నాగరాజన్, గంగరాజు మాట్లాడారు. మోదీని గద్దె దింపండి–దేశాన్ని కాపాడండి అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అదాని, అంబానీలకు కట్టబెట్టడం సరికాదన్నారు. పోలవరం నిధులు, రైల్వే జోన్ ఏర్పాటు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంటూ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని విమర్శించారు. కార్మికులు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలంలో బుధవారం ఎస్ఈబీ అధికారులు చేసిన దాడుల్లో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు సీఐ చంద్రశేఖర్ తన బృందంతో మొగిలిఘాట్‌లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మొగిలివారిపల్లెకు చెందిన సందీప్ (21) నుంచి కర్ణాటక మద్యం వంద ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, నాగరాజ, సుబ్రమణ్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భవతులకు మెరుగైన వైద్యసేవలు

చిత్తూరు రూరల్: హైరిస్క్ గర్భవతులకు మెరుగైన వైద్యసేవలు అందివ్వాలని డీఎం అండ్ హెచ్‌ఓ జి.ప్రకాశం ఆదేశించారు. చిత్తూరులోని జిల్లావైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఆశా నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. పీహెచ్‌సీల వారీగా గర్భిణులను గుర్తించి వైద్యసేవలు అందించేలా చూడాలన్నారు. ప్రధానంగా హైరిస్క్ కేసులను గుర్తించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే సేవలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. మాతా, శిశు మరణాలను నిరోధించేందుకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో తప్పిన ప్రాణాపాయం

పూతలపట్టు: వాహనం నడుపుతున్నపుడు హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడుకోవచ్చనేది ఓ ప్రమాదం పరోక్షంగా చాటి చెప్పింది. పోలీసుల కథనం..పాకాల మండలం మొగరాల పంచాయతీ కూనపల్లె చెందిన శేషాద్రి (42) పులిచెర్ల మండలంలోని వైన్‌షాపులో పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం పూతలపట్టు మండలం బండపల్లెలోని ఎక్సైజ్ డిపో వద్దకు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా రోడ్డుదాటే సమయంలో చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో శేషాద్రి హెల్మెట్ ధరించి ఉండడంతో ప్రాణాపాయం కలగలేదు. స్వల్పగాయాలతో బైటపడ్డాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారును నడుపుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ

బంగారుపాళెం: స్థానిక శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటారని గురువారం ప్రధానోపాధ్యాయురాలు ప్రతిమ తెలిపారు. గత నెలలో నిర్వహించిన పరీక్షలకు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఏజీఎంలు సురేష్, చక్రధర్, డీన్ ప్రతాప్, ఉపాధ్యాయులు అభినందించారు.